
కథ

# "వృత్తి ధర్మం"

గోపగాని రవీందర్

**జీవితంలో కొన్ని రోజులకు విశిష్ఠ స్థానం వుంటుంది. ఫలానా రోజు అని కొండగుర్తులు పెట్టుకొని, సందర్భం వచ్చినప్పుడల్లా వాటిని స్మరించుకుంటాం. అలాంటి రోజులలో ఈరోజు చేరుతుంది. లేచినప్పటి నుండి మనస్సులో దిగులు. శరీరం ఉత్సాహంగా ఉన్నా మనస్సు సహకరించకపోవటంతో యాంత్రికంగా పనులు ముగించుకొని పాఠశాలకు బయలుదేరాను.**

పిల్లలు సందడిగా తిరుగుతున్నారు. అంతా కోలాహలంగా వుంది వాతావరణం. ఏదో ఒక పనిలో హడావుడి చేస్తున్నారంతా. రంగురంగుల కాగితాలతో, మామిడి తోరణాలతో, సర్వాంగ సుందరంగా పాఠశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు విద్యార్థులు. ఈ ప్రాంగణంలో ఎన్నో కార్యక్రమాలు ఇప్పటికే నిర్వహించాము. కాని ఇంత ఆత్మీయంగా జరిగినట్టుగా లేవు. ఏదో మొక్కుబడిగా చేసేవారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సందడిగా తిరుగుతూ హుషారుగా వున్నారు. దానికితోడు సౌండ్ బాక్సుల నుండి పాటలు. నేటి సంగీతపు హోరు జోరుగా వినిపిస్తుంది. ఇంతకు అసలు విషయము గూర్చి తల్చుకుంటే గుండె భారంగా మూలుగుతున్నట్టుగా వుంది. నాలుగు దశాబ్దాలుగా వృత్తి జీవితం గడిపి, నేటితో విశ్రాంతి తీసుకోబోతున్న సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మణ్‌గారిని ఊహించుకుంటే దిగులు నిలువెల్లా ఆవరిస్తుంది. పదవి విరమణ కార్యక్రమాన్ని గూర్చి గత నెలరోజులుగా రకరకాలుగా ప్రణాళికలు వేసుకోవటంలో చురుగ్గా పాల్గొన్న నేను ఇవ్వాళ ఎందులో భాగస్వామిని కావాలన్నా కాలేకపోతున్న. స్టేజి అలంకరణ దగ్గర నిలబడి కొన్ని సూచనలు చేస్తూ విద్యార్థులతో చేయించాను. మరికొన్ని నిమిషాల్లో కార్యక్రమం ప్రారంభం అవుతుంది. గతం జ్ఞాపకాలు తొలుస్తూ ముందుకు వస్తున్నాయి.




సార్ అంటే మా అందరికి ఆదర్శం. ఆయన నడక, మాటతీరు చక్కగా విశ్లేషించే తత్వం. సూటిగా స్పష్టంగా వ్యక్తపర్చే భావాలు, తీసుకునే చొరవ ఆకట్టుకుంటాయి. నా మొదటి పాఠశాల ఆయన పనిచేస్తున్న ఉన్నత పాఠశాలలో కావటం అదృష్టంగా భావించిన. ఆదర్శాలతో మొదలైన ఉపాధ్యాయ వృత్తి రోజులు గడుస్తుంటే గందరగోళంగా మారింది. నా చదువు పిల్లలకు అందటంలేదు. పిల్లలను అర్థం చేసుకోవటంలో నా అవస్థను చూసి సార్ అనేక సలహాలు, సూచనలు ఇచ్చారు. 'నీ తపన బాగుంది. పిల్లలకు ఆసక్తిగా బోధించాలంటే ఇంకా నేర్చుకోవాలి. నేర్పుతూ నేర్చుకునేవాడే ఉపాధ్యాయుడు రవి' అన్నారు.

'పిల్లల మనసుల్ని అర్థం చేసుకోవాలనీ, అప్పుడే నీ చదువు వాళ్ళు గ్రహిస్తారని' చెప్పారు. మా పాఠశాల గ్రంథాలయంలో వున్న 'గిజుబాయి సాహిత్యం', 'పిల్లలకే నా జీవితం అంకితం', 'ఠాగూర్ సాహిత్యం', 'గుర్‌టిచర్', 'నా తొలి ఉపాధ్యాయుడు', 'కొన్ని కలలు కొన్ని మెలకువలు' పుస్తకాలను చదవాలనీ ప్రోత్సహించారు. శిక్షణ కాలంలో బట్టీ పట్టిన సిద్ధాంతాలను ఆచరణలోకి తేవటం కష్టం. పిల్లల మనసుల్ని గెలవాలి అనుకున్న. ఆయన నిరంతరం అధ్యయనశీలి. ఏదో ఒక పుస్తకం చదువుతూనే వుంటారు. ఇంటి నుండి ఇంటర్‌నేషనల్ విషయాల గూర్చి విడమర్చి చెప్పగల దిట్ట ఆయన. ఆ అలవాటు క్రమక్రమంగా నాకు ఒంటబట్టింది. పుస్తకాలు మనల్ని ఎలా ఉత్తేజితులను చేస్తాయో తెలిశాయి. నా బోధన విధానంలో

*సార్ అంటే మా అందరికి ఆదర్శం. ఆయన నడక, మాటతీరు చక్కగా విశ్లేషించే తత్వం. సూటిగా స్పష్టంగా వ్యక్తపర్చే భావాలు, తీసుకునే చొరవ ఆకట్టుకుంటాయి. నా మొదటి పాఠశాల ఆయన పనిచేస్తున్న ఉన్నత పాఠశాలలో కావటం అదృష్టంగా భావించిన.*

కృత్రిమత్వం పోయింది. సహజ ధోణిలో చెప్పటం వల్ల విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారు. అలాంటి గురువుగారు రేపటి నుండి బడికి రారు అనుకుంటే మనస్సు బరువెక్కింది.

ఆయన గంట ముందుగా పాఠశాలకు వచ్చి, గంట ఆలస్యంగా వెళ్ళేవారు. విద్యార్థుల సందేహాలను తీర్చుతూ సందడిగా గడిపేవారు. సెలవురోజుల్లో పిల్లల ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులతో మాట్లాడి వారి భవిష్యత్తుకు మార్గాలు వేసేవారు. 'మనం ఏదైనా




ఒక పనిని నిజాయితీగా చేస్తున్నామంటే దాన్ని ఎప్పుడు ఆపకూడదని' చెప్పేవారు. ఇలాంటి గురువుగారికి పదవి విరమణ సన్మానోత్సవాన్ని నిర్వహిస్తున్నాము. ఆయనతో గడిపిన క్షణాలు తల్చుకుంటే వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లుగా వుంది.

మనస్సు ఆలోచనల్లో అది వుండగా, వర్తమానంలో పిల్లల గోలలు, సంతోషపు చిరునవ్వులు, పాటలు, మాటలు, వచ్చేవాళ్ళతో ప్రాంగణమంతా ఉత్సవం జరుగుతున్నట్టుగా వుంది. స్థానిక ఎమ్మెల్యేను ముఖ్యఅతిథిగా ఆహ్వానించాము. పురప్రముఖులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం ఘనస్వాగతాల మధ్య డప్పుల హోరుతో వేదిక మీదికి సార్‌ను తీసుకవచ్చి కూర్చోబెట్టారు. "నిరంతర అధ్యయనశీలి, పిల్లల భవిష్యత్తుకు చక్కని ప్రణాళికలు వేసి విడమర్చి చెప్పి చూపే మార్గదర్శి, తరగతి గదుల్లోనే కాదు, సమాజంలోని సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ఆత్మవిశ్వాసంతో బోధించే ఉపాధ్యాయులు, తన జీవితాన్ని వృత్తికి అంకితం చేసిన గురుదేవ్ లక్ష్మణ్" గారికి సన్మానమని అనగానే ప్రాంగణమంతా చప్పట్లతో మార్మోగింది. అందరు నిలబడి ఆయన సేవకు కృతజ్ఞతలు తెలిపారు. వున్నంతలో గొప్పగా సత్కారం చేశాము. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో గురువుగారికి ఆనందం కల్గిస్తూ ప్రతి విద్యార్థి పాదాభివందనం చేశారు. కొందరు ఉపాధ్యాయులు ఆయనతోగల అనుబంధాన్ని మాటలతో పంచుకున్నారు.

చివరగా సార్ మాట్లాడే తరుణం వచ్చింది. అందరు భావోద్వేగంతో ఎదురుచూస్తున్నారు. తన గతాన్ని తల్చుకుంటూ స్వగతంలోకి వెళ్లారు మాష్టరు. "మాది పేద మధ్యతరగతి కుటుంబం. వ్యవసాయం ఆధారంగా గల రైతు కుటుంబంలో జన్మించాను. మేము ముగ్గురు అన్నదమ్ములం. నేను చిన్నవాణ్ణి. అన్నలు వ్యవసాయం పనులు చేసేవారు. మా ఊరిలోని ప్రాథమిక పాఠశాలలోని సార్ చెప్పగా చెప్పగా నాయన చేర్పించాడు. బడికి పోనని ఏడ్చిన. చదవకుంటే కొడ్తరని ఏడ్చిన. నేను ఎన్ని వంకలు పెట్టిన బడికి మాన్పించలేదు. కొన్ని రోజుల్లోనే చదువంటే ఇష్టంగా మారింది. సెలవులు వున్నప్పుడు ఇంటి పనులు, పొలం పనులు చేసిన. వ్యవసాయం పనులు చేస్తుంటే మంచిగా చేయలె. రైతు బిడ్డకు పనులు రాకుంటే నామోషి. మా పెద్దనాయన ఒకసారి నా పనులను చూసి తిట్టిండు. 'ఒరే లక్ష్మణ్! నీకు వ్యవసాయం పనులు చాతకాదురా, బాగా చదువుకోరా!' అన్నాడు.

ఊరు నుంచి పట్టణానికి నా చదువు మారింది. ఆ రోజుల్లో చదువుకునే వాళ్ళు తక్కువ. కొద్ది చదువుకే టీచర్ ఉద్యోగం వచ్చింది. నా ఆర్డర్ కాపి తీసుకొని ఇంటికి పోయిన. నాకొచ్చిన కొలువు గూర్చి ఆనందంగా చెప్పిన. మా కుటుంబం సంతోషపడింది. కానీ మా పెద్దనాయన చెప్పిన మాటలు ఇప్పటికీ నా చెవుల్లో గిర్రున తిరుగుతాయి. "ఒరే! లక్ష్మణ్! వర్షాలు ఎక్కువ పడితే పంటలు ఏమవుతాయి? వర్షాలు పడకపోతే ఏమవుతాయి? సరిగ్గా పండవు. దాంతో రైతు నష్టపోతాడు. ప్రకృతి కన్నెర్ర రైతు జీవితాన్ని అల్లకల్లోలం చేస్తుంది బిడ్డ. నీకొచ్చిన నౌకరి ఎండకు ఎండదు. వానకు తడవదు. ప్రకృతితో సంబంధం లేనిది బిడ్డా! నీకు చాతనైనదాకా పిల్లలకు మంచి చెయ్యరా!" అన్నాడు.

అప్పటి నుండి నా జీవితం, ఉద్యోగ జీవితం అంటూ వేరుగా లేకుండా ఇంతకాలం పనిచేసిన. పని చేయటంలో ఆనందాన్ని పొందిన. అన్ని వృత్తులు మంచివే. మనం ఎన్నుకునే వృత్తికి న్యాయం చేయాలి. ఉపాధ్యాయ వృత్తి మరింత బాధ్యత కలది. ఎన్నో ఊళ్ళు తిరిగిన. చాలాచోట్ల అనుభవాలను మూటగట్టుకున్న. ఇక్కడ విరమణ పొందుతున్న. తరగతి గదుల్లో మాటల ఊటనై బతుకు సమరం చేసిన, పొద్దుతో పోటి పడిన బాల్యాన్ని పిల్లల్లో చూసుకున్న. నా ప్రపంచం నా పాఠశాలే అను కున్న. అందరు నా పిల్లలే అనుకున్న. నా పని నేను చేసుకుంటు వచ్చిన.

ఇవ్వాళ ఉపాధ్యాయ వృత్తి మీద వస్తున్న ఆరోపణలు వింటుంటే బాధగా వుంటుంది. కొన్ని సంఘటనలు తల తీసేసినట్లుగా వుంటున్నాయి. విలువలతో కూడిన విద్యలో వ్యాపారం పాగ వేసుకుంది. వ్యాపారంగా నాణ్యమైన సరుకుగా విద్య మారిపోయింది. విలువలు పెంపొందాలంటే విద్యే అందుకు ఆధారం. నా విద్యార్థులు రాజకీయ నాయకులుగా, శాస్త్రవేత్తలుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, సమసమాజం కోసం పోరాడే వీరులుగా, మానవహక్కుల నేతలుగా, వ్యాపారులుగా, రచయితలుగా, కవులుగా వున్నారు. ధనార్జనే ప్రధానంగా కాకుండా, మన విధి మనం నిర్వర్తించాలి. ప్రకృతి మార్పులతో సంబంధం లేనిది మన ఉద్యోగం. మీరందరు మీ శక్తిమేరకు పిల్లలకు న్యాయం చేయండి. ఇదే నా పదవి విరమణ సందేశం" అని ముగించారు సారు.

మనస్ఫూర్తిగా ఎవరికి వారు తమ పనులు చేస్తుంటే, మార్పు వస్తుందని ఆశిస్తూ రోజు గంట ముందుగా బడికి వెళ్లటం అలవాటు చేసుకుంటున్న సార్ వారసత్వం అందుకుంటు...!

●